ఉత్తరం

# కాకతీయ

TG TEL/25/A1234

www.kakatiyanews.com

శుక్రవారం, 16 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 56 | పేజీలు: 4 వెల: 5




## రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కాం ఆపాలి

### భోత్రా లాజిస్టిక్స్ పాత్రపై సమాధానం చెప్పాలి

- స్వతంత్ర విచారణ జరిపించి వాస్తవాలు వెల్లడించాలి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

**కాకతీయ, హైదరాబాద్:** రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణాన్ని వెంటనే ఆపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల పేరుతో రాష్ట్రంలో కృత్రిమ కొరత సృష్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి,

........(తరువాయి 2లో)

## నేరగాళ్లపై ఉక్కుపాదం!

### అర్బన్ పోలీసింగ్‌లో సాంకేతికతకు పెద్దపీట

- నిరంతర గస్తీ.. సత్వర స్పందన
- ఆస్తి నేరాల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ
- పోక్సో కేసుల్లో గడువులోగా చార్జిషీట్లు
- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు
- మల్కాజిగిరి కమిషనరేట్ సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** నేరాల నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రామాణికమైన అర్బన్ పోలీసింగ్‌ను అమలు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. నిరంతర గస్తీ, పటిష్ఠ నిఘా, సత్వర స్పందనతో నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. నేరాల స్వభావం, ప్రాంతాల వారీ పరిస్థితులను విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ప్రజలు పోలీసుల పనితీరును వారు స్పందించే తీరును బట్టే అంచనా వేస్తారని పేర్కొన్నారు. గురువారం మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌లో సీపీ సుమతి, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్షలో నేరాలు, దర్యాప్తు, ఆస్తి నేరాలు, సైబర్ మోసాలు, మహిళలు, బాలికల భద్రత, రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు.

**పెరుగుతున్న నేరాలపై ప్రత్యేక నిఘా**

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో నేరాల గణాంకాలను

........(తరువాయి 2లో)

### 22ఏ జాబితాలో 25,518 ఎకరాల వ్యత్యాసం

అటవీ భూముల లెక్కల్లో 23.79 లక్షల ఎకరాల తేడా

ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఎందుకు దాచారు?

ధరణి, భూభారతిపై బీజేపీ సమరభేరి మోగించింది

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ భూముల బదలాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్



# ధరణి.. భూభారతిలో భూ భాగోతాలు!

## 23 లక్షల ఎకరాలు.. 13 వేల ఖాతాలు!




**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

ధరణి.. భూభారతి పోర్టళ్లలో భూ రికార్డుల నిర్వహణ నుంచి నిషేధిత జాబితాల రూపకల్పన, ప్రభుత్వ భూముల పరిరక్షణ వరకు అనేక అంశాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సుమారు 23 లక్షల ఎకరాల భూమి 13 వేల ఖాతాలకు బదిలీ అయినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెల్లడైందని రెవెన్యూ మంత్రి స్వయంగా అసెంబ్లీలో అంగీకరించిన నేపథ్యంలో, ఆ భూముల వివరాలు, లావాదేవీలు, బాధ్యుల పేర్లను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. నిషేధిత భూముల గణాంకాల్లో భారీ వ్యత్యాసాలు, ప్రైవేటు ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడం, ప్రభుత్వ భూముల అనుమానాస్పద బదిలీలు, అసైన్డ్ భూములపై కొత్త విధానాల చర్చ వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ధరణి, భూభారతి వ్యవహారాలపై న్యాయ విచారణతోపాటు సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

........(తరువాయి 2లో)

## అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా

- ఏటూరునాగారం ఎక్సైజ్ వేలంలో ఇష్టారాజ్యం
- వేలం వేళ మూడు ముక్కలంటూ.. తీరా రెండు ముక్కలతోనే సరి
- 35 వాహనాల్లో 32 చాయిస్ నంబర్లు..
- ఎక్సైజ్ వేలంలో అధికారుల తీరుపై అనుమానాలు
- సీఐ సమాధానంపై వినియోగదారుల ఆగ్రహం
- ఉన్నతాధికారులు స్పందించేనా



4

## ఏసీబీ వలలో వేములవాడ రూరల్ తహసీల్దార్!

- రూ.8 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్, ప్రైవేటు ఆపరేటర్
- వ్యవసాయ భూమి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం డిమాండ్
- నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచిన అధికారులు

3

- గురువారం తెలంగాణ భవన్‌లో వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్ కీలక భేటీ
- జిల్లా నేతలకు క్లారిటీ ఇవ్వనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్
- కేడర్‌ను గాడిలో పెట్టేందుకు తాత్కాలిక ఇన్‌చార్జి
- పెద్ది కుటుంబ ప్రాధాన్యానికి భంగం లేకుండా వ్యూహం

# నర్సంపేట పగ్గాలు పోచంపల్లికి!

## పెద్ది స్వప్నకు సమన్వయ బాధ్యతలు..!

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

వరంగల్ జిల్లా నర్సంపేట బీఆర్ఎస్ రాజకీయాల్లో నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణంతో ఖాళీ అయిన నియోజకవర్గ బాధ్యతలను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డికి తాత్కాలికంగా అప్పగించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు గురువారం ఉదయం తెలంగాణ భవన్‌లో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో జరగనున్న సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.




పెద్ది సతీమణి స్వప్న సుదర్శన్‌రెడ్డికి ఇప్పటికిప్పుడు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించకుండా, పార్టీ వ్యవహారాలను సమన్వయం

........(తరువాయి 2లో)



# సింగరేణిని కాపాడుతోంది మేమే!

- బొగ్గు గనులు కోల్పోయింది మీ హయాంలోనే
- కొత్త గనులు తేలేని మీరు.. మా పాలనపై విమర్శలా?
- టెండర్లలో పారదర్శకతతోనే అక్రమాలకు అడ్డుకట్ట
- సింగరేణి సంపద పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- కేటీఆర్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

సింగరేణి విషయంలో గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, గనుల కేటాయింపు, టెండర్లలో సైట్ విజిట్ నిబంధన, కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఆయన గణాంకాలతో సమాధానమిచ్చారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా, తూకం, తుది పంపిణీ వరకు పలు అంచెల పర్యవేక్షణ వ్యవస్థ అమల్లో ఉందని, ఆధారాలు లేకుండా సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దని స్పష్టం చేశారు. కొత్త గనుల సాధన, టెండర్లలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణే తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని పేర్కొన్నారు. సింగరేణిలో ప్రస్తుతం తొమ్మిది గనుల నుంచి జీ9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతోందని శ్రీధర్‌బాబు వివరించారు. గత పదేళ్లలో

........(తరువాయి 2లో)




# ఉద్యోగుల ఐక్యతే టీజీఈజేఏసీ బలం!

- ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తెద్దాం
- ప్రజా ప్రభుత్వంలోనే ఎన్నో సమస్యలకు పరిష్కారం
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

**కాకతీయ, వరంగల్ :** ఉద్యోగుల ఐక్యతతోనే మరిన్ని సమస్యలను పరిష్కరించుకోగలమని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. గురువారం వరంగల్‌లో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగుల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను ప్రజా ప్రభుత్వంలో పరిష్కరించుకోగలిగామని, ఇందుకు ఉద్యోగుల ఐక్యతే ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సంక్షేమమే లక్ష్యంగా టీజీఈజేఏసీ పనిచేస్తోందని లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల హక్కుల కోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతూనే, సఖ్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు రెండు కరువు భత్యాల మంజూరు, కొత్త ఆరోగ్య పథకం అమలు, రూపాయి కూడా చెల్లించకుండా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించడంలో జేఏసీ కృషి ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఐక్యతను కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని ఉద్యోగులకు సూచించారు.

**ప్రతి ఉద్యోగి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా

........(తరువాయి 2లో)

# నేరగాళ్లపై ఉక్కుపాదం!

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించిన డీజీపీ, దొంగతనాలు, మోసాలు, గాయపరిచే ఘటనలు, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. 2024లో 18,778 కేసులు, 2025లో 18,480 కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. 2026లో ఇప్పటివరకు నమోదైన కేసుల సంఖ్యపై సమీక్షలో గణాంకాలు ప్రస్తావనకు వచ్చాయి. దొంగతనాల కేసులు 2024లో 1,484 ఉండగా, 2025లో 1,662కు పెరిగాయి. 2026లో ఇప్పటి వరకు 2,196 కేసులు నమోదయ్యాయి. మోసాల కేసులు 2024లో 2,404 నుంచి 2025లో 2,636కు, 2026లో 2,789కు చేరాయి. గాయపరిచే ఘటనలు 2024లో 1,311 ఉండగా, 2026లో 1,797కు పెరిగాయి. హత్యల కేసులు 2024లో 40, 2025లో 45, 2026లో ఇప్పటివరకు 41గా నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు 2026లో 365కు చేరాయి. ఈ గణాంకాలను పోలీస్ స్టేషన్ వారీగా విశ్లేషించి, నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలని డీజీపీ సూచించారు. నేరం జరిగిన వెంటనే సంబంధిత బృందాలు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించేలా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

**గస్తీతోనే నేరాలకు కళ్లెం**

రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతోపాటు డయల్ 112 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని డీజీపీ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు గస్తీ నిర్వహణను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. పాత నేరగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రౌడీషీటర్లపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మురికివాడలు, బస్తీల్లో నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, పునరావృత నేరాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని తెలిపారు. కీసర, ఎల్‌బీ నగర్, ఉప్పల్, బేగంపేట, జవహర్‌నగర్, మేడిపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో ఆస్తి నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నేపాల్ గ్యాంగ్ కదలికలపై నిఘా పెంచాలని చెప్పారు. బొల్లారంలో జరిగిన ఆయుధాల చోరీ కేసులో పటిష్ఠ దర్యాప్తుతో నిందితులను త్వరగా అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. బొల్లారం కైకూరులోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల బాలిక హత్య ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో సీసీటీవీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**పోక్సో కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు**

మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. పోక్సో కేసుల్లో సాంకేతిక ఆధారాలను సేకరించి, సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసి గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. జవహర్‌నగర్, హయత్‌నగర్, కుషాయిగూడ, వనస్థలిపురం, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న కేసులను ప్రత్యేకంగా సమీక్షించాలని తెలిపారు. షీ టీమ్స్ సహకారంతో కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాధితులకు పరిహారం అందేలా చూడటంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు కల్పించాలని స్పష్టం చేశారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాద మరణాలపై డీజీపీ ఆరా తీశారు. కీసర, చర్లపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో గత ఏడాదితో పోలిస్తే ప్రమాద మరణాలు పెరిగినట్లు అధికారులు వివరించారు. ద్విచక్రవాహన ప్రమాదాలు ప్రాణనష్టానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉన్నాయని పేర్కొంటూ, ప్రమాదాల హాట్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. విజయవాడ-వరంగల్ మార్గం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో పెట్రోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టడంతోపాటు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ప్రస్తావించిన గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాద మరణాలు 2024లో 308, 2025లో 270 ఉండగా, 2026లో ఇప్పటి వరకు 340 నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి, ప్రాణ నష్టం తగ్గించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.

**సైబర్ నేరాలపై అవగాహన.. ప్రత్యేక శిక్షణ**

కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 10 నుంచి 11 సైబర్, వైట్ కాలర్ నేరాల కేసులు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తులో నైపుణ్యం పెంచేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించాలని డీజీపీ సూచించారు. కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను గుర్తించినప్పుడు సంబంధిత బృందాలు వెంటనే వెళ్లి అరెస్టు చేసేలా అవసరమైన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సూచించారు. ప్రత్యేక ఆపరేషన్ బృందాలు స్థానిక పోలీసులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా సరూర్‌నగర్‌లోని ఈగల్ పోలీస్ స్టేషన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అధికారులను గుర్తించి ప్రోత్సాహకాలు, రివార్డులు అందించాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు రౌడీషీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

**పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా సిబ్బంది**

కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణతో కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధులు మారాయని, సిబ్బంది కేటాయింపుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు వివరించారు. పునర్వ్యవస్థీకరణ అనంతరం మల్కాజిగిరి కమిషనరేట్‌కు 235 పోస్టులు రావాల్సి ఉన్నట్లు సీపీ సుమతి తెలిపారు. సిబ్బంది కొరత, ప్రాంతాల వారీ నేరాల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీసింగ్‌ను మరింత సమర్థంగా నిర్వహించాలని డీజీపీ సూచించారు. నేరాల నియంత్రణలో సాంకేతికత, నిరంతర గస్తీ, సత్వర స్పందన, సమన్వయంతో కూడిన దర్యాప్తు కీలకమని స్పష్టం చేశారు. సమీక్షలో డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సంపేట పగ్గాలు పోచంపల్లికి!

(మొదటిపేజీ తరువాయి)




చేసేందుకు మరో నేతను ముందుకు తీసుకురావాలన్నది అధిష్ఠానం ఆలోచనగా ప్రచారం జరుగుతోంది. అధికారిక ప్రకటన వెలువడితే నర్సంపేటలో నాయకత్వంపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడనుంది.

**పెద్ది మరణంతో నాయకత్వ శూన్యత**

తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేటలో బీఆర్ఎస్‌కు బలమైన పునాది నిర్మించారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించడంతోపాటు కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. ఆయన అకాల మరణం పార్టీకి రాజకీయంగా, కేడర్ పరంగా లోటుగా మారింది. అప్పటి నుంచి నియోజకవర్గాన్ని ఎవరు నడిపిస్తారన్న ప్రశ్న పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. తాత్కాలికంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, దీర్ఘకాలిక కార్యాచరణకు స్పష్టమైన నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నర్సంపేట నియోజకవర్గానికి తాత్కాలిక ఇన్‌చార్జిగా పోచంపల్లి శ్రీనివాసరెడ్డిని నియమించే అంశం ఇప్పుడు కీలకంగా మారింది. ఆయనకు బాధ్యతలు అప్పగించడం ద్వారా స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడంతోపాటు పార్టీ కార్యక్రమాలను క్రమబద్ధీకరించవచ్చని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో ఈ నిర్ణయాన్ని జిల్లా నేతలకు తెలియజేసే అవకాశముంది. నియామకం తాత్కాలిక స్వరూపంలోనే ఉండనుందన్న ప్రచారం నేపథ్యంలో, పోచంపల్లి పాత్ర నియోజకవర్గ రాజకీయాలకు దిశానిర్దేశం చేయనుంది. అయితే బాధ్యతల కేటాయింపుపై తుది స్పష్టత పార్టీ అధికారిక ప్రకటనతోనే రానుంది.

**స్వప్న రాజకీయ భవిష్యత్తుపై వ్యూహం**

పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డికి రాజకీయ అనుభవం ఉంది. గతంలో నల్లబెల్లి జడ్పీటీసీగా, వరంగల్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంలోనూ ఆమె కీలకంగా వ్యవహరించారు. అందువల్ల ఆయన మరణం తర్వాత నియోజకవర్గంలో ఆమె పాత్రపై సహజంగానే ఆసక్తి నెలకొంది. అయితే ప్రస్తుతం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించకుండా, ఆమెకు తగిన సమయం ఇచ్చి, మరో నేత ద్వారా పార్టీ కార్యకలాపాలను కొనసాగించాలన్న ఆలోచన ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇది పెద్ది కుటుంబాన్ని పక్కనపెట్టే నిర్ణయమా, లేక తాత్కాలిక నిర్వహణ కోసమేనా అన్నది పార్టీ స్పష్టతనుబట్టి తేలనుంది. పోచంపల్లికి బాధ్యతలు అప్పగిస్తే ఆయన ముందున్న ప్రధాన సవాలు కేడర్‌ను ఐక్యంగా ఉంచడమే. పెద్ది సుదర్శన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసిన స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు నడపాల్సి ఉంటుంది. నాయకత్వ మార్పు సమయంలో స్థానికంగా ఏర్పడే అసంతృప్తిని నివారించడం, గ్రామస్థాయి పార్టీ నిర్మాణాన్ని చురుకుగా ఉంచడం కీలకం. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం పోటీలు లేదా అంతర్గత విభేదాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా తాత్కాలిక ఇన్‌చార్జిపైనే ఉంటుంది. అందుకే నియామకంతోపాటు పార్టీ శ్రేణులకు అధిష్ఠానం ఇచ్చే సందేశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

**తెలంగాణ భవన్ భేటీపై ఉత్కంఠ**

గురువారం ఉదయం జరగనున్న సమావేశం నర్సంపేట నాయకత్వానికి సంబంధించి కీలక మలుపుగా మారనుంది. పోచంపల్లి నియామకంపై స్పష్టత ఇవ్వడంతోపాటు వరంగల్ జిల్లా పార్టీ వ్యవహారాలపై నేతలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. పెద్ది కుటుంబంతో సమన్వయం ఎలా కొనసాగాలి, స్వప్న సుదర్శన్‌రెడ్డికి భవిష్యత్తులో ఎలాంటి బాధ్యతలు కల్పించాలి, నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. ప్రస్తుతానికి పోచంపల్లికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలన్నదే ప్రధాన రాజకీయ పరిణామంగా కనిపిస్తోంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే నియామకం, బాధ్యతల పరిధి, తదుపరి కార్యాచరణపై పూర్తి స్పష్టత రానుంది.

# సింగరేణిని కాపాడుతోంది మేమే!

(మొదటిపేజీ తరువాయి)

ఇంధన సరఫరా ఒప్పందాలున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 40 లక్షల టన్నుల జీ9 బొగ్గు సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 2.5 కోట్ల టన్నులకు పైగా బొగ్గు సరఫరా చేయగా, అందులో జీ9 గ్రేడ్ బొగ్గు 12 లక్షల టన్నులేనని పేర్కొన్నారు. ఈ పరిమాణంలో 5.2 లక్షల టన్నులు తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రాలకే అందించినట్లు వెల్లడించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఏటా 1.4 కోట్ల టన్నుల జీ9 బొగ్గు సరఫరా చేసేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. సింగరేణి భవిష్యత్తులో కొత్త గనుల ద్వారా ఉత్పత్తి పెంచుతుందనే అంచనాతోనే ఆ ఒప్పందం జరిగిందన్నారు. కానీ ఆ గనులు అందుబాటులోకి రాకపోవడానికి గత పాలకుల నిర్ణయాలే కారణమని విమర్శించారు.

**కీలక బ్లాకులు కోల్పోయింది గత పాలనలోనే**

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాకులు సంస్థకు దక్కలేదని మంత్రి ఆరోపించారు. ఫలితంగా ఏటా దాదాపు కోటి టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. దాదాపు 14 గనులు మూతపడటంతో 1.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంపై ప్రభావం పడిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించిందని చెప్పారు. గతంలో పట్టించుకోని నైనీ గనిపై ఇప్పుడు చర్యలు తీసుకున్నామని, 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచెర్ల బ్లాక్2కు మైనింగ్ అనుమతులు సాధించామని వివరించారు. మణుగూరు పీకే ఓసీ2 డిప్‌సైడ్ బ్లాక్‌ను వేలం ద్వారా సింగరేణికి దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ గనుల ద్వారా భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

**ప్రతి టన్నుకూ లెక్క..**

**చోరీకి అవకాశమే లేదు**

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, రవాణా, తూకం, పంపిణీ వరకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బహుళ అంచెల పర్యవేక్షణ వ్యవస్థ ఉందని శ్రీధర్‌బాబు వివరించారు. SAP/ERP అనుసంధానం, జీపీఎస్ ఆధారిత వాహనాల పర్యవేక్షణ, జియోఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బూమ్ బారియర్లు, బొగ్గు నిల్వల తనిఖీలు, చోరీ నిరోధక బృందాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. 137 ఏళ్ల మైనింగ్ అనుభవం ఉన్న సంస్థలో ప్రతి దశకు లెక్కలు, పర్యవేక్షణ ఉన్నాయని, ఆధారాలు లేకుండా బొగ్గు మాయమవుతోందంటూ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. అక్రమాలు జరిగాయని చెబుతున్న కేటీఆర్, ఇతర నాయకులు తమ వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయితీని ప్రశ్నించే ముందు వాస్తవాలను పరిశీలించాలని సూచించారు. టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను ప్రవేశపెట్టడం వెనుక సింగరేణి ప్రయోజనమే ఉందని మంత్రి స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు పనులు చేపట్టే ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, స్థానిక సామాజిక అంశాలు, మౌలిక సదుపాయాలను ముందుగానే పరిశీలించాలన్నదే ఈ నిబంధన ఉద్దేశమన్నారు. గతంలో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులకు టెండర్లు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయకుండానే పనులు ప్రారంభించి, తరువాత ఇబ్బందులతో పనులు నిలిపివేయడం లేదా మధ్యలోనే వదిలేయడం వల్ల సంస్థ నష్టపోయిందని వివరించారు. ఈ నిబంధన సింగరేణికే పరిమితం కాదని, జీఎండీసీ, జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ వంటి సంస్థలతోపాటు కొన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టులు, ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ అమలవుతోందని తెలిపారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ సీఎంపీడీఐ సలహా మేరకు 2018, 2021, 2023లో పిలిచిన కొన్ని టెండర్లలోనూ సైట్ విజిట్ నిబంధన ఉందని గుర్తుచేశారు. గతంలో సరైనదైన నిబంధన ఇప్పుడు తప్పెలా అవుతుందని ప్రశ్నించారు.

**టెండర్లలో పారదర్శకత..**
**కమీషన్లకు అడ్డుకట్ట**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని శ్రీధర్‌బాబు తీవ్ర విమర్శలు చేశారు. టెండర్లలో అక్రమాలు, కమీషన్ల సంస్కృతికి అడ్డుకట్ట వేసి పారదర్శకత తీసుకొస్తున్నందునే కొందరు అసహనంతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. విద్యుత్ సంస్థల పేరుతో సింగరేణికి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తూ సంస్థను బలోపేతం చేసే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్మికుల లాభాల వాటా, సంక్షేమంపై మాట్లాడే ముందు గత పాలనలో వారికి జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కార్మికుల ప్రయోజనాలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సింగరేణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ అని, ఇందులో రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉందని మంత్రి గుర్తుచేశారు. సంస్థను ప్రైవేటీకరించే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తితోపాటు కీలక ఖనిజాలు, థర్మల్ విద్యుత్, సౌర విద్యుత్ రంగాల్లోనూ సింగరేణి కార్యకలాపాలను విస్తరించే కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. గత పాలకులు కొత్త గనులు సాధించడంలో విఫలమయ్యారని, ఇప్పుడు గనులు సాధిస్తున్న తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపాలపై కూడా గత ప్రభుత్వానిదే బాధ్యతని ఆరోపించారు. ఆ లోపాలను సరిదిద్దుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని, సంస్థ సంపదను పెంచి ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలతో సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయకుండా, సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు.

# రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కాం ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బొగ్గు దిగుమతుల ఒప్పందాలు, టెండర్ల ప్రక్రియ, ధరలు, రవాణా ఖర్చుల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ సంస్థ పాత్ర ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. టెండర్ల ఎంపిక విధానం, ఒప్పందాల వివరాలు, చెల్లింపులపై పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. టన్నుకు రూ.1,500 కమీషన్ చెల్లిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని, ఈ వ్యవహారంలో రూ.3 వేల కోట్ల అక్రమాలు జరిగాయన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు.

**సింగరేణి బకాయిలు,**
**ఉత్పత్తి తగ్గుదలపై నిలదీత**

సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల నుంచి 2025-26లో సుమారు 58 మిలియన్ టన్నులకు తగ్గిందని కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. సింగరేణికి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిల వివరాలను వెల్లడించాలని కోరారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి సింగరేణి నుంచి జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు కేటాయింపులు ఉన్నప్పటికీ విదేశీ బొగ్గు దిగుమతుల అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దేశీయ బొగ్గు సరఫరాను పెంచే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు స్వతంత్ర విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బొగ్గు దిగుమతుల పరిమాణం, ధరలు, రవాణా వివరాలు, సింగరేణి ఉత్పత్తి తగ్గుదలకు కారణాలు, బకాయిల స్థితిపై పూర్తి సమాచారం ప్రజలకు అందించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయోజనాలను కాపాడాలని లేఖలో పేర్కొన్నారు.

# ఉద్యోగుల ఐక్యతే టీజీఈజేఏసీ బలం!

(మొదటిపేజీ తరువాయి)




తెలుసుకునేందుకే ముఖాముఖి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని లచ్చిరెడ్డి వివరించారు. ఉద్యోగుల నుంచి సేకరించిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ పెద్దలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని లచ్చిరెడ్డి అన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గిందనే వాదనలతో వారి ప్రాధాన్యాన్ని తక్కువగా అంచనా వేయలేమని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల భాగస్వామ్యంతో ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఉద్యోగి ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అర్హులైన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను కూడా నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జేఏసీ నాయకుడు ముహమ్మద్ ఇక్బాల్ అధ్యక్షత వహించగా, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్‌తోపాటు ఎస్.రాములు, కె.మహిపాల్‌రెడ్డి, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, గరికె ఉపేంద్రరావు, హబీబుద్దీన్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్, వర్రె భిక్షం, బుచ్చయ్య, వై.కుమార్, అజీజ్, సుదర్శన్‌గౌడ్, రాజేశ్వరరావు, మురళీ, శ్రీనివాస్, కృష్ణంరాజు, తిరుపతి, వేణు, అర్జున్ మల్లారం, శిరీషారెడ్డి, బుచ్చిబాబు, నర్సమ్మ, కె.సతీష్, పులిరాజు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బార్ల లక్కీ డ్రాకు ఏర్పాట్లు పూర్తి

- 41 బార్లకు 8,770 దరఖాస్తులు
- 17న ఉదయం 11 గంటలకు లైసెన్సుల ఎంపిక

**కాకతీయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో బార్ల లైసెన్సుల ఎంపికకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 14 బార్లతో పాటు ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని 27 బార్లకు శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించనున్నారు. తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు రాగా, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 41 బార్లకు 8,770 దరఖాస్తులు అందాయి. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా లైసెన్సీలను ఎంపిక చేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలోని బార్లకు సంబంధించిన డ్రాను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ నిర్వహిస్తారు. మిగిలిన జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు డ్రా ద్వారా లైసెన్సీలను ఎంపిక చేస్తారు. తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 14 బార్ల డ్రాను సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు. దరఖాస్తుదారుల కోసం నార్సింగిలోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ తెలిపారు. వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపామని, దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

# ధరణి.. భూభారతిలో భూ భాగోతాలు!

(మొదటిపేజీ తరువాయి)

గురువారం నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు.

**23 లక్షల ఎకరాలు.. 13 వేల ఖాతాలు!**

ధరణి పోర్టల్‌లో భూ రికార్డుల బదిలీలపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో సుమారు 23 లక్షల ఎకరాల భూమి 13 వేల ఖాతాలకు బదిలీ అయినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో అంగీకరించారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. ఇంత భారీ స్థాయిలో భూముల బదిలీ జరిగినట్లు వెల్లడైనప్పుడు ఆ భూములు ఎక్కడున్నాయి? ఎవరి ఖాతాలకు బదిలీ అయ్యాయి? ఏ ప్రాతిపదికన మార్పులు చేశారు? వాటి వెనుక ఎవరున్నారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను బయటపెట్టకుండా ప్రత్యేక దర్యాప్తు బృందం స్థానంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. విచారణను ముందుకు తీసుకెళ్లకుండా దారి మళ్లిస్తున్నారా అనే అనుమానాలను వ్యక్తం చేశారు. ధరణి వ్యవహారంపై మొదటి నుంచి బీజేపీ ఫోరెన్సిక్ ఆడిట్ కోరిందని, అసెంబ్లీలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు అధికార పక్షం మైకులు కట్ చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అయినప్పటికీ తమ పోరాటం ఫలితంగానే ధరణిపై చర్చకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. గతంలో లక్షల కోట్ల రూపాయల భూ దోపిడీ జరిగిందని విమర్శించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎకరం భూమిని కూడా తిరిగి స్వాధీనం చేసుకోకపోవడం, బాధ్యులపై కేసులు నమోదు చేయకపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**22ఏ జాబితాలో లెక్కల గందరగోళం!**

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ప్రకారం అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్ భూముల వంటి చట్టబద్ధంగా నిషేధిత ఆస్తులను జాబితాలో ఉంచాల్సి ఉంటుందని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అయితే రేరా, ఇతర చట్టబద్ధ అనుమతులు పొందిన భవనాలు, కాలనీలకు సంబంధించిన ప్రైవేటు ఆస్తులను కూడా నిషేధిత జాబితాలో చేర్చి యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు నిషేధిత జాబితాలో ఉండాల్సిన కొన్ని భూముల వివరాల్లోనూ స్పష్టత లేదని విమర్శించారు. తప్పు జరిగిందని మంత్రి క్షమాపణ చెప్పడం సరిపోదని, నెలలు గడుస్తున్నా ప్రైవేటు భూములను జాబితా నుంచి తొలగించకపోవడంతో పట్టాదారులు సబ్‌రిజిస్ట్రార్, మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఈ గందరగోళాన్ని బినామీలు, దళారులు కమిషన్ల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించిన గణాంకాలను ప్రస్తావిస్తూ, 2023 డిసెంబరు 7 నాటికి 22ఏ నిషేధిత జాబితాలో 98,56,838 ఎకరాల భూమి ఉండగా, 2026 ఆగస్టు 31 నాటికి 98,31,320 ఎకరాలకు తగ్గిందని తెలిపారు. ఈ రెండు గణాంకాల మధ్య 25,518 ఎకరాల వ్యత్యాసం ఉందని, ఆ మార్పులకు కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అటవీ భూముల విషయంలోనూ గణాంకాలు పొంతన లేకుండా ఉన్నాయని అన్నారు. మీడియా నివేదికల్లో 66,33,313 ఎకరాలుగా పేర్కొనగా, రెవెన్యూ మంత్రి అసెంబ్లీలో 42,53,532 ఎకరాలుగా వెల్లడించారని తెలిపారు. ఈ రెండింటి మధ్య 23,79,781 ఎకరాల వ్యత్యాసం ఉందని వివరించారు. దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి మంత్రి వెల్లడించిన 5,12,792 ఎకరాల గణాంకాలు, వక్ఫ్ భూములపై మీడియా నివేదికల్లో పేర్కొన్న 1.79 లక్షల ఎకరాల వివరాలపైనా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే 24,63,940 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేదలకు కేటాయించిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

**సాదాబైనామా దరఖాస్తుల సంగతేంటి?**

ధరణి పోర్టల్‌లో సాదాబైనామా క్రమబద్ధీకరణకు సంబంధించి 11.42 లక్షల ఎకరాలు, 9.24 లక్షల దరఖాస్తుల వివరాలను ప్రస్తావించిన మహేశ్వర్‌రెడ్డి, వాటిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రస్తుత స్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. భూ రికార్డుల నిర్వహణలో గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ రద్దు తర్వాత తగిన భరోసా లేకుండా పోయిందని విమర్శించారు. సుమారు రూ.116 కోట్లు ఖర్చు చేసి ప్రైవేటు సంస్థకు భూముల డేటా నిర్వహణ బాధ్యతలు అప్పగించిన వ్యవహారంలోనూ పారదర్శకత అవసరమన్నారు. రిజిస్ట్రేషన్ ఒక్కటే భూమిపై సంపూర్ణ యాజమాన్య హక్కుకు తుది నిర్ధారణ కాదని, అయితే చట్టబద్ధమైన హక్కులు కలిగిన ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై బడా వ్యక్తుల కన్ను పడిందని, వాటిని విక్రయించుకునే హక్కులు కల్పించేలా కొత్త జీవో తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలను మహేశ్వర్‌రెడ్డి వ్యక్తం చేశారు. బిగ్ ఐడీఎల్ గల్ఫ్ ఆయిల్ వ్యవహారంలో 871 ఎకరాల భూమికి సంబంధించి ఆరోపణలు ఉన్నాయని, దాని విలువ రూ.87 వేల కోట్లుగా పేర్కొన్న అంశంపై విచారణ జరగాలని కోరారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూములను ఫీనిక్స్, హానర్ వంటి కంపెనీలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయని, అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.1,000 చొప్పున సేల్స్ సర్టిఫికెట్లు జారీ చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూముల్లో విలాసవంతమైన భవనాలు ఎలా నిర్మించారో ప్రభుత్వం వివరించాలని కోరారు. ఉదాసీన మఠానికి సంబంధించిన 537 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. ఐడీపీఎల్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ సంస్థ భూమిలో సుమారు 60 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పేదల 60 గజాల ఇళ్లను కూల్చే హైడ్రా, ప్రభావవంతుల ఆస్తుల విషయంలో అదే స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదన్నారు. మూసీ నదిలో సుమారు మూడు ఎకరాల ఆక్రమణ ఆరోపణలు, ఆదిత్య లగ్జరీ టవర్స్ నిర్మాణం, హైడ్రా నోటీసుల అనంతరం చర్యలు లేకపోవడం వంటి అంశాలపై వివరణ కోరారు. వంశీరామ్ బిల్డర్స్‌కు సంబంధించిన కేసులో 27 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, దాని విలువ సుమారు రూ.7,000 కోట్లుగా పేర్కొన్న అంశంపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. 1954-55 రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్న ఆస్తి 1995లో ప్రైవేటు వ్యక్తుల పేర్లకు ఎలా మారిందో తేల్చాలని అన్నారు.

**సర్వే నంబర్ల మార్పులపై విచారణ జరగాలి**

నిషేధిత జాబితాలోని సర్వే నంబరు 27 మాయమై, నేరుగా 22వ నంబరుకు మారినట్లు కనిపిస్తున్న వ్యవహారాన్ని మహేశ్వర్‌రెడ్డి ప్రస్తావించారు. కలెక్టర్ లేఖ ఆధారంగా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు ఆరోపణలు ఉన్నాయని, సుమారు తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో దాని విలువ రూ.2,200 కోట్లుగా పేర్కొన్న అంశంపై విచారణ జరపాలని కోరారు. నాలా భూమిని నోషనల్ ఖాతాలోకి మార్చిన వ్యవహారం, పుప్పాలగూడలోని సర్వే నంబర్లు 285, 286, 287కు సంబంధించిన లావాదేవీలపైనా సమగ్ర విచారణ అవసరమన్నారు. గతంలో ఎవాక్యుయీ ప్రాపర్టీగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిరాకరించిన భూమికి సంబంధించిన ప్రాజెక్టులకు అనుమతులు ఎలా వచ్చాయనే ప్రశ్నను లేవనెత్తారు. బ్లూస్టోన్, ఫీనిక్స్, నోవా ప్రాజెక్టులకు హైరైజ్ భవనాల అనుమతులు మంజూరైన నేపథ్యంలో మంత్రి పొంగులేటి కుటుంబానికి సంబంధించిన కంపెనీలకు అనుమతులు ఎలా వచ్చాయో వివరించాలని కోరారు. ఈ వ్యవహారాల్లో ప్రయోజనాల సంఘర్షణ, అధికార దుర్వినియోగం జరిగాయా అనే కోణంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి, జానకిరాంగూడ ప్రాంతాల్లో సుమారు 17 ఎకరాల భూమికి సంబంధించిన లావాదేవీలపైనా ప్రశ్నలు లేవనెత్తారు. రైతుల నుంచి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ సేకరించిన భూమిని ఫీనిక్స్‌కు కేటాయించడం, అందులో 7.83 ఎకరాలను డీనోటిఫై చేసి బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వడం, అనుమతి వచ్చిన మరుసటి రోజే రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం వంటి పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సుమారు 14 ఎకరాల భూమి రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు ఎలా బదిలీ అయిందో తేల్చాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ భూములపై సీబీఐ విచారణకు డిమాండ్**

ధరణి, భూభారతి పోర్టళ్లకు సంబంధించిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను బహిర్గతం చేయాలని, 22ఏ నిషేధిత జాబితాలోని గణాంకాల వ్యత్యాసాలకు కారణాలు వెల్లడించాలని, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనుమానాస్పద బదిలీలు, ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చిన వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూ రికార్డుల్లో జరిగిన ప్రతి మార్పును పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధమైన హక్కులు కలిగిన భూ యజమానులకు న్యాయం చేయాలని కోరారు. భూ కుంభకోణాలపై న్యాయ విచారణతోపాటు సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ, నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి విజయమే లక్ష్యం

- ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేయాలి
- పార్టీ శ్రేణులకు హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల పిలుపు
- మడికొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సమన్వయ సమావేశం







**కాకతీయ, వరంగల్ బ్యూరో** : వరంగల్ ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి పట్టభద్రులు భారీ మెజారిటీ అందించారని గుర్తుచేశారు. అదే విజయ పరంపరను రాబోయే ఎన్నికల్లోనూ కొనసాగించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాలు, సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని పట్టభద్రులకు వివరించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడంతోపాటు, పోలింగ్ బూత్ స్థాయి నుంచి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ప్రచారాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఈ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..**

సమావేశంలో పాల్గొన్న ఎంపీలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను పట్టభద్రులకు వివరించాలని సూచించారు. నవంబర్ 6వ తేదీలోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు.

**బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేయాలి..**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి ప్రచార కార్యక్రమాలను నిర్వహించి, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో వినిపించే నాయకుడిగా ఆయనను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కె.ఆర్. నాగరాజు, హనుమాండ్ల యశస్విని రెడ్డి, జాటోత్ రాంచంద్రు నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## చిరు వ్యాపారులపై దాడులు ఆపాలి

- ట్రైసిటీలో ప్రత్యేక సంతలు, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలి
- కూల్చివేతలతో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలి
- చిరు వ్యాపారుల జీవనోపాధిని కాపాడాలి
- బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి
- చిరు వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్

**కాకతీయ, హనుమకొండ** : చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను నిలిపివేసి, వారికి శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, చిరు వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రైసిటీలో చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక సంతలు, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ పండ్ల వ్యాపారుల దుకాణాల కూల్చివేతలతో అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కూల్చివేతలతో నష్టపోయిన వ్యాపారులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**పెద్ద వ్యాపారులపై చర్యలు ఏవీ?**

బీఆర్ఎస్ నాయకుడు ఎస్కే మహమూద్ మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించిన పెద్ద వ్యాపారులపై చర్యలు తీసుకోకుండా చిరు వ్యాపారులనే లక్ష్యంగా చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మూడేళ్లుగా చిరు వ్యాపారులపై పలుమార్లు చర్యలు జరుగుతున్నా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించడం లేదని విమర్శించారు. అధికారులే అన్ని చేస్తే ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. నగరంలో మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడంతో పాటు చిరు వ్యాపారుల జీవనోపాధిని కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్, చిరు వ్యాపార సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపు
- రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఘనంగా శ్రీకారం




**కాకతీయ, హనుమకొండ:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో గురువారం 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య లాన్ టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు టెన్నిస్ రాకెట్లు పట్టి కోర్టులో ఆడటంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కేఆర్ నాగరాజు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. హనుమకొండలో టెన్నిస్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమయపాలన, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. అక్టోబర్ 15 నుంచి 17 వరకు జరిగే పోటీల్లో అండర్ 17, అండర్ 19 బాలబాలికలు పాల్గొంటున్నారు. ప్రతిభ చూపినవారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు, టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ ఏటీసీ పనులు ఆర్డీవో విజిట్



**కాకతీయ, ఇనుగుర్తి** : మండల కేంద్రం ఇనుగుర్తిలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను,ఎ టి సి నిర్మాణ స్థలంలో చేపట్టిన చదును పనులను ఆర్డిఓ రాజేశ్వరి విజిట్ చేశారు. స్థానిక తహసిల్దార్ సుంకరి శ్రీనివాస్ లు తో కలిసి గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల పురోగతిపై ఆరా తీశారు. ఏటీసీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పను ల్లో పారదర్శకత,నాణ్యతా ప్రమాణాలను పాటించి వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బషీర్, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ నరేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యం!

- రూ.2 లక్షలలోపు పంట రుణాల మాఫీ
- రూ.80 కోట్లతో కళికోట సురమ్మ ప్రాజెక్టు
- రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**కాకతీయ, చందుర్తి:** రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రైతును రాజుగా కాకుండా రారాజుగా నిలబెట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గురువారం చందుర్తి, సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన అధ్యక్షులు గసికంటి ప్రభాకర్, ఎగోలం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్ హామీ మేరకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేశామని, రాష్ట్రవ్యాప్తంగా రూ.20,650 కోట్లతో 25.28 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, కనీస మద్దతు ధరతో కొనుగోళ్లు చేపడుతున్నామని చెప్పారు. కళికోట సురమ్మ ప్రాజెక్టును రూ.80 కోట్లతో అభివృద్ధి చేస్తూ 48 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వేములవాడ నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రహదారులు, వంతెనలు, విద్యుత్, సాగునీటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని, పంటల కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాసేవే తన లక్ష్యమని, రైతుల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## యుజిడి పనులు వేగవంతం చేయాలి

- మున్సిపల్ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి
- కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** వరంగల్ నగరంలో ప్రతిపాదిత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యుజిడి) ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి కేఎఫ్ డబ్ల్యూ (కేఎఫ్ డబ్ల్యూ ) సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, టెండర్ ప్రక్రియ తదితర కీలక అంశాలపై చర్చించారు. డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, వరంగల్ నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి ప్రజారోగ్య పరిరక్షణకు, పారిశుధ్య మెరుగుదలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాంకేతిక, పరిపాలనా అంశాలను సమన్వయంతో పరిష్కరిస్తూ టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ, సమగ్ర యుజిడి వ్యవస్థ ఏర్పాటు ద్వారా మురుగునీటి నిర్వహణ మెరుగుపడటంతో పాటు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు అందుతాయని తెలిపారు. సంబంధిత శాఖలు, కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలను వేగవంతం చేస్తామన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ సాయప్ప రెడ్డి, ఎస్ఈ రంజిత్, బల్దియా ఈఈ మహేందర్, డీఈ కార్తీక్ రెడ్డి, కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- రికార్డులు, లాకప్, పరిసరాల పరిశీలన
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశం



**కాకతీయ, చిగురుమామిడి** : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా విని సత్వర న్యాయం అందించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ప్రతులు, పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించరాదని, గ్రామాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని సీపీ స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్, చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో వేములవాడ రూరల్ తహసీల్దార్!

- రూ.8 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్, ప్రైవేటు ఆపరేటర్
- వ్యవసాయ భూమి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం డిమాండ్
- నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచిన అధికారులు



తహసీల్దార్ మహమ్మద్ అబూబకర్



భూభారతి ఆపరేటర్ అనిల్ కుమార్

**కాకతీయ, వేములవాడ:** వ్యవసాయ భూమి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం రూ.8 వేల లంచం తీసుకుంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహసీల్దార్ కం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ అబూబకర్, ప్రైవేటు ఆపరేటర్ సంకసాల అనిల్‌కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. బాధితుడి అత్తకు చెందిన వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరిట గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు తహసీల్దార్ మహమ్మద్ అబూబకర్ రూ.8 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం ప్రకారం కార్యాలయంలో నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు.. ప్రైవేటు ఆపరేటర్ అనిల్‌కుమార్ ద్వారా తహసీల్దార్ లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు. అనిల్‌కుమార్ వద్ద నుంచి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో పట్టుబడిన తహసీల్దార్, ప్రైవేటు ఆపరేటర్‌ను కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్
- మూడు జిల్లాల అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్



**కాకతీయ, హైదరాబాద్** : గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఒక్క లబ్ధిదారుడూ మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు, సహాయక పరికరాల పంపిణీకి అర్హుల గుర్తింపు, శిబిరాల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**అర్హుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి**

హుస్నాబాద్ నియోజకవర్గంలో అలిమ్కో (ఏఎల్ఐఎంసీఓ) ఆధ్వర్యంలో ఏడీఐపీ (ఏడీఐపీ) పథకం కింద వృద్ధులు, దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కోసం ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరిందా అనే అంశాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు. గ్రామాల్లో డప్పు చాటింపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి అవసరమైన సహాయక పరికరాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో 2 మండలాలకు ఒక రోజు, హనుమకొండ జిల్లాలో 2 మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో 3 మండలాలకు 2 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిబిరాలకు ముందుగానే అర్హుల వివరాలను సేకరించి పూర్తి స్థాయి డేటా సిద్ధం చేయాలని, లబ్ధిదారులందరూ హాజరయ్యేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. డీఆర్డీఓ, పీడీ, డీడబ్ల్యూఓలతో పాటు జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు సహాయక పరికరాలు అందించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ప్రజల తీర్పును ప్రశ్నించే ముందు.. ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించండి!

ఒక దేశం బలంగా ఉండాలంటే ఆ దేశ ప్రజలు సుఖశాంతులతో జీవించడంతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంప్రదాయాలు తరతరాలకు కొనసాగాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించి ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలి. జర్మనీలో వృత్తిపరమైన జీవితం కొనసాగిస్తున్న ఒక సాధారణ భారతీయ పౌరుడిగా, అందుబాటులో ఉన్న సమాచారం, వార్తా కథనాలు, బహిరంగ ప్రకటనలను పరిశీలించిన అనంతరం నా అభిప్రాయాలను మీ ముందుంచుతున్నాను. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలకు ఎప్పుడూ చోటుండాలి. ఎన్నికల సంఘం నిర్ణయాలను ప్రశ్నించడం తప్పు కాదు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే ఆధారాలతో నిలదీయవచ్చు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. పారదర్శక విచారణ కోరవచ్చు. అయితే నిర్ధారణ కాని ఆరోపణలతో ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెంచడం ఎంతవరకు సమంజసం? రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారి రాజీనామాలను రాజకీయ డిమాండ్లుగా ముందుకు తేవడానికి ముందు ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం లేదా? భారతదేశంలో కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది మంది ఎన్నికల సిబ్బంది భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియల్లో ఒకటి నిర్వహించబడుతోంది. మాక్ పోల్స్, యంత్రాల తనిఖీలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరిగే ప్రక్రియలు వంటి భద్రతా చర్యలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ వ్యవస్థలో ఎక్కడా తప్పులు జరగవని చెప్పలేం. అదే సమయంలో ఆరోపణలు వచ్చినంత మాత్రాన మొత్తం వ్యవస్థను తప్పుబట్టడం కూడా సరికాదు. ఏ ప్రక్రియలో అవకతవక జరిగింది? దానికి సంబంధించిన రికార్డులు ఏమిటి? అన్నది స్పష్టంగా నిరూపించాలి.

**గెలిచినప్పుడు ఒక మాట.. ఓడినప్పుడు మరో మాటా?**

ఎన్నికల వ్యవస్థ ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించేవారు ఒక విషయాన్ని ఆలోచించాలి. అదే ఎన్నికల ప్రక్రియ ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కర్ణాటకలోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో బీజేపీ, ప్రాంతీయ పార్టీలు, ఇతర రాజకీయ పక్షాలు ప్రజల మద్దతుతో ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఒక రాష్ట్రంలో ఒక పార్టీకి మద్దతిచ్చిన ఓటరు మరో రాష్ట్రంలో వేరే పార్టీని ఎన్నుకోవచ్చు. స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, రాజకీయ అభిప్రాయాలు, ప్రజల ఆకాంక్షల ఆధారంగా ఓటర్లు నిర్ణయాలు తీసుకుంటారు. ఇదే భారత ప్రజాస్వామ్య వైవిధ్యం. అయితే కాంగ్రెస్ గెలిచిందనే కారణంతో ఎన్నికలపై వచ్చిన అన్ని ఆరోపణలు అసత్యమని నిర్ధారించలేం. బీజేపీ గెలిచిందనే కారణంతోనూ అవకతవకలు జరిగాయని చెప్పలేం. ప్రతి ఆరోపణను ఆధారాలు, రికార్డులు, విచారణల ప్రకారం పరిశీలించాలి. ఎన్నికల్లో ఓటమి ఎదురైతే ప్రజల మద్దతు ఎందుకు తగ్గిందో విశ్లేషించుకోవాలి. నిజంగా అక్రమాలు జరిగాయని ఆధారాలు ఉంటే చట్టబద్ధంగా పోరాడాలి. ప్రజల తీర్పును గౌరవించడం అన్ని రాజకీయ పార్టీలకూ సమానంగా వర్తించాలి.

**రాజ్యాంగం.. ప్రజల ఓటు విలువే ముఖ్యం**

ఎన్నికల పరిణామాల వెనుక అంతర్జాతీయ శక్తులు, 'డీప్ స్టేట్', మీడియా లేదా ఇతర సంస్థల కుట్ర ఉందనే వాదనలు వినిపించినప్పుడు వాటిని భావోద్వేగాలతో కాకుండా ఆధారాలతో పరిశీలించాలి. ఒకేసారి కొన్ని సంఘటనలు జరగడం మాత్రమే వాటన్నింటి వెనుక ఒకే కుట్ర ఉందని నిరూపించదు. సమాచారం మూలం, ప్రత్యక్ష సాక్ష్యాలు, ప్రత్యామ్నాయ వివరణలు పరిశీలించినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ , మీడియా వంటి సంస్థల్లో తప్పులు జరిగితే ప్రశ్నించాలి. అవసరమైన సంస్కరణలు కోరాలి. అయితే నిర్ధారణలేని ఆరోపణలతో సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీయడం వల్ల నష్టం ప్రజాస్వామ్యానికే. ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలి. రాజకీయ పార్టీలు బాధ్యతతో మాట్లాడాలి. మీడియా వాస్తవాలను పరిశీలించి ప్రజలకు అందించాలి. దేశాన్ని ప్రేమించడం అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదని కాదు. ఎన్నికల సంఘాన్ని విమర్శించకూడదని కూడా కాదు. ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. అయితే ప్రశ్నించేటప్పుడు ఆధారాలతో మాట్లాడాలి. ఆరోపణలు చేసేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. మనకు నచ్చిన నాయకుడి కంటే భారత రాజ్యాంగం గొప్పది. మనకు నచ్చిన ఎన్నికల ఫలితం కంటే ప్రజల ఓటు విలువ గొప్పది. ప్రజల తీర్పును గౌరవిద్దాం.. ఆధారాలతో ప్రశ్నిద్దాం.. రాజ్యాంగ విలువలను కాపాడుదాం. భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేద్దాం.

\- శ్రీరామ్ ఉదయ్



## సాఫ్ట్‌బాల్ పోటీలను విజయవంతం చేయాలి

- క్రీడలతో చెడు వ్యసనాలకు దూరం
- మాజీ కార్పొరేటర్ బోడ డిన్న

**కాకతీయ, హనుమకొండ :** క్రీడలను ప్రోత్సహించడంతో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతోపాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తాయని మాజీ కార్పొరేటర్ బోడ డిన్న అన్నారు. హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మైదానంలో టోర్నమెంట్ ఏర్పాట్లు, క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. అసోసియేషన్ సేవలను అభినందిస్తూ, వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అసోసియేషన్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శులు తాబేటి రాజేందర్, ఎం. భగత్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, సంయుక్త కార్యదర్శులు సుమలత, రాజేశ్వర్, కోచ్‌లు పోలేపాక వినయ్‌కుమార్, తాబేటి నాగరాజు, బుస రాజు, ఏ. సృజన, సుష్మ, శశాంక్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హాఫ్ మారథాన్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

**కాకతీయ, వరంగల్ బ్యూరో :** హాఫ్ మారథాన్ పరుగు నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 17న వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఉదయం 4 నుంచి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు ఫాతిమా సెంటర్, మదర్ థెరిసా సెంటర్, వడ్డేపల్లి చర్చి, తులసి బార్, కేయూసీ జంక్షన్, నయీంనగర్, సీపీఓ జంక్షన్ మీదుగా హనుమకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ, తిరుమల బార్, వడ్డేపల్లి చర్చి, ఫాతిమా సెంటర్, కాజీపేట మీదుగా వెళ్లాలి. కరీంనగర్ వెళ్లే వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ మీదుగా వెళ్లాలని సూచించారు. ఖమ్మం నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ వద్ద మళ్లింపు తీసుకుని పోతన జంక్షన్ మీదుగా చేరుకోవాలి. 100 ఫీట్ల రోడ్డుపై ఒకవైపు మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ నుంచి అదాలత్ వైపు, అంబేద్కర్ జంక్షన్ నుంచి కాలేజీ జంక్షన్ వరకు, ఫాతిమా జంక్షన్ నుంచి ఎన్ఐటీ వైపు ఉదయం 4 నుంచి 10 గంటల వరకు వాహనాలకు అనుమతి ఉండదని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు.

## ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవే

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండ
- సమస్యలపై అధ్యయనం చేసి మద్దతుగా నిలుస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కాకతీయ, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, వారి పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రావు, అధికార ప్రతినిధి డాక్టర్ బోడ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా బాధ్యుడు వినయ్‌కుమార్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జేఏసీ బాధ్యుడు కుమార్ తదితరులు హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, తమ డిమాండ్లను వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను సావధానంగా విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, హక్కుల సాధనకు మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు.

## వర్ధన్నపేట ఎస్సైగా భోగం ప్రవీణ్ బాధ్యతలు



**కాకతీయ, వర్ధన్నపేట:** మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తానని వర్ధన్నపేట నూతన ఎస్సై భోగం ప్రవీణ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ఎన్. సాయిబాబ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, పర్వతగిరి నుంచి బదిలీపై వచ్చిన ప్రవీణ్ ఆయన స్థానంలో నియమితులయ్యారు. మండలంలో అక్రమ దందాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నూతన ఎస్సై హెచ్చరించారు. యువత సన్మార్గంలో పయనించాలని, గంజాయి, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సై ప్రవీణ్‌కు పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రజా పీడన

- విద్యుత్ కోతలతో రైతులకు ఇబ్బందులు
- సింగరేణి ఉత్పత్తి, లాభాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్




**కాకతీయ, కేసముద్రం:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కాకుండా ప్రజా పీడన సాగిస్తోందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ విమర్శించారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్‌తోపాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోతుండటంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, లాభాల క్షీణత, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల వివరాలను వెల్లడించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కమటం శ్రీనివాస్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, హరి నాయక్, దేవేందర్, కౌన్సిలర్లు ఆగే రాము, పైరాల శరత్ యాదవ్, దూడపాక కృష్ణ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం

- ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం!
- రైతుల పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు
- సింగరేణి బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తి పెంచాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**కాకతీయ, భూపాలపల్లి :** రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపులేని నిర్ణయాలు, సరైన ప్రణాళిక లేకపోవడమే కారణమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించి, పంటలను కాపాడాలని ప్రభుత్వానికి చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మోటార్లు పనిచేయక సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు కారణమయ్యాయనే అంశాన్ని సమీక్షించాలని గండ్ర డిమాండ్ చేశారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, సింగరేణి మధ్య సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వీటి చెల్లింపుల్లో జాప్యం విద్యుత్ రంగంపై ప్రభావం చూపుతోందని ఆరోపించారు. ఓవర్‌బర్డెన్ టెండర్లలో రాజకీయ జోక్యం, అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. చెల్పూర్ జెన్‌కో విద్యుత్ కేంద్రంలో సుమారు 1,100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రస్తుతం 400 నుంచి 600 మెగావాట్ల మేరకే ఉత్పత్తి జరుగుతోందని పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును నిరంతరంగా సరఫరా చేయడంతోపాటు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు.

**రైతుల పంటలను కాపాడాలి**

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందేదని గండ్ర గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అంతరాయాలతో ఫ్యూజులు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, మోటార్లు పనిచేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. వరి పంటలకు కీలకమైన రాబోయే 15 రోజుల నుంచి నెల రోజుల వ్యవధిలో నిరంతర విద్యుత్ అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి, లోటుపై గత మూడునాలుగేళ్ల గణాంకాలతో సమగ్ర విశ్లేషణ చేసి, ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కోరారు. థర్మల్, సౌర విద్యుత్ ఉత్పత్తిని అంచనా వేస్తూ, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయాలని సూచించారు. అధికారులను సస్పెండ్ చేయడం, వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ఎత్తిపోతల పథకానికి సరిపడా విద్యుత్ అందక మోటార్లు పనిచేయడం లేదని, సాగునీటితోపాటు తాగునీటి అవసరాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని గండ్ర తెలిపారు. దేవాదులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే వారి పక్షాన ఉద్యమించి, రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

- హెవీ వాహనాల ఇష్టారాజ్యపు పార్కింగ్‌పై చర్యలు
- బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- హసన్‌పర్తి, వంగపహాడ్ రహదారులపై భద్రతా చర్యలు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**కాకతీయ, హన్మకొండ :** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన హెవీ వాహనాలు, ప్రైవేట్ ట్యాక్సీలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలను ఆర్ అండ్ బీ ఈఈ దేవిక వివరించారు. కోమటిపల్లి పరిధిలోని జాతీయ రహదారిపై ట్రక్ లేబై ఏర్పాటు, వంగపహాడ్ వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను జాతీయ రహదారుల అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలకు విరుద్ధంగా హెవీ వాహనాలు, ప్రైవేట్ ట్యాక్సీలను రహదారుల పక్కన నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రహదారులపై లైన్ మార్కింగ్ స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా బీటీ రోడ్డు నిర్మించిన హసన్‌పర్తి వైపు లైన్ మార్కింగ్, రోడ్డు స్టడ్స్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల అధికారులకు సూచించారు. వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, వాటి వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, జాతీయ రహదారుల మేనేజర్ లింగయ్య, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డులో రూ.500 కోట్ల అక్రమాలు!

- అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- రేపు లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

**కాకతీయ, నర్సంపేట టౌన్:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో గత మూడేళ్లలో రూ.500 కోట్ల మేర అక్రమాలు జరిగాయని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ, 2025 జూన్ 22న జారీ చేసిన జీవో నంబర్ 12 ద్వారా ముంబైకి చెందిన ట్రయల్ బ్లేజర్ ఇన్సూరెన్స్ బ్రోకర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.346 కోట్లు చెల్లించినట్లు ఆరోపించారు. బోర్డు తీర్మానం లేకుండా నిధులు విడుదల చేయడంపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వ రంగ బీమా సంస్థలు అందుబాటులో ఉండగా ప్రైవేటు సంస్థకు బాధ్యతలు అప్పగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగించడం వల్ల కార్మికుల సంక్షేమ ప్రయోజనాలపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రేపు లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గణిపాక రాజశేఖర్, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కలాం సేవలు చిరస్మరణీయం

- క్షిపణి రంగంలో ఆయన కృషి ప్రపంచానికి మార్గదర్శకం
- విద్యార్థులు కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి
- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి

**కాకతీయ, హనుమకొండ :** భారతదేశ శాస్త్రసాంకేతిక రంగానికి విశేష సేవలందించిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అన్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మహనీయుడు కలాం అని కొనియాడారు. గురువారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్ అధ్యక్షతన అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ, భారత క్షిపణి పితామహుడిగా పేరొందిన అబ్దుల్ కలాం కీర్తి అజరామరమని పేర్కొన్నారు. అణ్వాయుధాల రూపకల్పన, క్షిపణుల తయారీలో ఆయన చేసిన కృషి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా, సామాన్య పౌరుడిగా ఆయన అనుసరించిన జీవన విధానం ఎంతోమందికి ఆదర్శప్రాయమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని శాస్త్రసాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా బాధ్యులు నయీమొద్దీన్, డివిజన్ అధ్యక్షులు రాజు, సదాంత్, శివకుమార్, సీనియర్ నాయకులు రవీందర్ రావు, జానకీరాములు, చాగంటి రమేష్, మల్లేశం, నాయిని రవి, సారంగపాణి, నాయకులు ఇస్మాయిల్, నారాయణగిరి రాజు, ఎస్కే మహమూద్, ఖలీల్, గౌస్ ఖాన్, సర్దార్, బైరపాక ప్రశాంత్, సారిక, పబ్బోజు శ్రీకాంత్ చారి, మంద సృజన్ కుమార్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.




## అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా

- ఏటూరునాగారం ఎక్సైజ్ వేలంలో ఇష్టారాజ్యం
- వేలం వేళ మూడు ముక్కలంటూ.. తీరా రెండు ముక్కలతోనే సరి
- 35 వాహనాల్లో 32 చాయిస్ నంబర్లు..
- ఎక్సైజ్ వేలంలో అధికారుల తీరుపై అనుమానాలు
- సీఐ సమాధానంపై వినియోగదారుల ఆగ్రహం
- ఉన్నతాధికారులు స్పందించేనా





**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** ఏటూరునాగారం ఎక్సైజ్ శాఖ నిర్వహించిన ద్విచక్ర వాహనాల స్క్రాప్ వేలం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వేలం సమయంలో ఒక విధంగా నిబంధనలు చెప్పి, వాహనాలను అప్పగించే సమయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ 24న నిర్వహించిన వేలంలో వాహనాలను మూడు ముక్కలుగా చేయాల్సి ఉంటుందని చెప్పడంతో పలువురు వెనుదిరిగారని వినియోగదారులు చెబుతున్నారు. అయితే అక్టోబర్ 15న వాహనాలను రెండు ముక్కలుగానే స్క్రాప్ చేసి అప్పగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యత్యాసంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వేలం సమయంలో మూడు ముక్కలుగా చేయాలనే షరతు చెప్పడంతో తాము పాటలో పాల్గొనలేదని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. రెండు ముక్కలుగానే స్క్రాప్ చేసి అప్పగిస్తారని ముందే తెలిసి ఉంటే తాము కూడా వేలంలో పాల్గొనేవారమని అంటున్నారు. వేలంలో ప్రకటించిన నిబంధనలకు, వాహనాల అప్పగింతలో అనుసరిస్తున్న విధానానికి మధ్య తేడా ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. వేలం నోటీసులో పేర్కొన్న షరతులు, వాహనాలను ధ్వంసం చేసే విధానం, అప్పగింత రికార్డులను పరిశీలిస్తేనే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**35 వాహనాలు.. 32 చాయిస్ నంబర్లు!**

వేలంలో ఉన్న 35 ద్విచక్ర వాహనాల్లో 32 వాహనాలకు చాయిస్ నంబర్లు ఉన్నట్లు వెల్లడవడం మరో చర్చకు దారితీసింది. దీనిపై ప్రశ్నించగా, వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పుడే వాటికి చాయిస్ నంబర్లు లేవని, ఇప్పుడు తామేమీ చేయలేమని అధికారులు చెప్పినట్లు సమాచారం. అయితే స్వాధీనం సమయంలో నమోదు చేసిన వివరాలు ఏమిటి? కేసుల రికార్డుల్లో వాహనాల గుర్తింపు వివరాలు ఎలా ఉన్నాయి? వేలానికి ముందు వాటిని పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఛాసిస్, ఇంజిన్ నంబర్లు, స్వాధీన పంచనామాలు, వేలం జాబితాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**గతంలోనూ ఇదే విధానమా?**

గతంలో స్క్రాప్ పేరుతో వేలం వేసిన కొన్ని ద్విచక్ర వాహనాలను తిరిగి రోడ్లపై వినియోగిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు నిర్ధారణ కావాల్సి ఉంది. స్క్రాప్ చేసిన వాహనాలు తిరిగి వినియోగంలోకి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రస్తుత వేలానికి వర్తించే అధికారిక నిబంధనలు ఏమిటి? అన్న అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా, గతంలో ఏ విధంగా చేశామో ఇప్పుడూ అలాగే చేస్తున్నామని చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ సమాధానం తమ సందేహాలను నివృత్తి చేయలేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేలం సమయంలో ప్రకటించిన షరతులు, వాహనాల అప్పగింత విధానం, చాయిస్ నంబర్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేదంటే అధికారిక రికార్డులతో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏటూరునాగారం ఎక్సైజ్ వేలం వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# గంభీరావుపేట ఎస్సైని సస్పెండ్ చేయాలి

- జర్నలిస్టులకు చిత్రహింసలపై న్యాయ విచారణ జరిపించాలి
- హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశించాలి
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కొరిమి వెంకటస్వామి



**కాకతీయ, శంకరపట్నం:** జర్నలిస్టులు కొత్తూరు శేఖర్, రాతిపెల్లి సంపత్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరిమి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం శంకరపట్నం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై ఇలాంటి చర్యలు జరిగాయనే ఆరోపణలు ఆందోళనకరమని పేర్కొన్నారు. మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్‌ను సస్పెండ్ చేయడంతోపాటు బాధ్యులుగా తేలిన పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టులు ఇద్దరూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266